క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



అచ్చయ్యపేటలో ఆరోగ్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు

గోకవరం: మండలంలోని అచ్చయ్యపేటలో అంగన్‌వాడీ సెంటర్‌ను జిల్లా వైద్య శాఖ అధికారి వెంకటేశ్వరరావు బుధవారం తనిఖీ చేశారు. ఫ్యామిలీ ఫిజిషియన్, మాతా శిశు సంరక్షణా సేవలు, వ్యాధి నిరోధక టీకాలు తదితర సేవలపై ఏఎన్‌ఎంలను ఆరా తీశారు. అనంతరం ఆశా యాప్‌పై సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యులు తిరస్, ఆలేఖ్య, మేరీ, కృప, ఎంపీహెచ్ఈఓ రాయుడు, సిబ్బంది ఉన్నారు.

ఎంపీటీసీ దొంగబాబు మృతికి సంతాపం

కిర్లంపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు అధ్యక్షతన బుధవారం దివంగత ఎంపీటీసీ సభ్యుడు కాళ్ల దొంగబాబు సంతాప సభ నిర్వహించారు. ఎంపీపీ తోట రవి, ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు మృతుడు దొంగబాబు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజాప్రతినిధిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, ఎంపీటీసీలు అల్లు శివరామకృష్ణ, బండారు ప్రసాదు, సాదే కుమారి, గోకాడ రాజా, వైఎస్సార్ సీపీ నాయకులు పెంటకోట నాగబాబు, మండల సచివాలయాల కన్వీనర్ పెనగంటి రాజేష్, శరకణం సంతోష్, రాపేటి ప్రసాద్, నైదాన రఘు తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురికి బంగారు వరలక్ష్మీ రూపులు

గోకవరం: ఆధ్యాత్మిక ప్రచార కార్యక్రమంలో భాగంగా మండలంలోని గాదెలపాలెంలో ఆరుగురు మహిళలకు బంగారు వరలక్ష్మీ కానుక పేరుతో బుధవారం గ్రాము చొప్పున బంగారు రూపులు పంపిణీ చేశారు. స్థానిక దేవీచౌక్ ఆలయం నుంచి గాదెలపాలేనికి ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వంద బైక్‌లపై ర్యాలీగా వెళ్లారు. వంద మంది మహిళలు బంగారు వరలక్ష్మీ కానుక లాటరీకి నమోదు చేసుకోగా లాటరీ ద్వారా ఆరుగురిని ఎంపిక చేసి బంగారు రూపులు అందజేశారు. కార్యక్రమంలో దేవీచౌక్ ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథ శర్మ, శ్రీనివాస్‌రావు, ఆలయ సేవకులు వరసాల ప్రసాద్, తామర్ల రాంబాబు, మామిడి అయ్యప్ప, ఇనకోటి బాపన్నదొర, పోశిన ప్రసాద్, బండి మణి, మెకానిక్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సి.రాయవరంలో పొలంబడి

ఏలేశ్వరం: మండలంలోని సి.రాయవరంలో బుధవారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి బి.జ్యోతి ఆధ్వర్యంలో రైతులకు పొలంబడిపై శిక్షణ ఇచ్చారు. వరి సాగులో ఆకులు, పిలకలు, కత్తిరించిన 45వ రోజు వరకు ఎటువంటి నష్టం వాటిల్లదని తెలిపారు. మిత్ర పురుగులు, శత్రు పురుగులు గుర్తింపు, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. రైతులు తమ పంటలకు తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం తనిఖీ

తొండంగి: స్థానిక భవిత కేంద్రాన్ని సమగ్ర శిక్ష కో ఆర్డినేటర్, సీఎంఓ చామంతి నాగేశ్వరరావు బుధవారం తనిఖీ చేశారు. కేంద్రంలో రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రత్యేక అవసరాల గల పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని సూచించారు. వారి వ్యక్తిగత ఆరోగ్యం పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం చిన్నారులకు పలు ప్రశ్నలు సంధించి అందిస్తున్న విద్యను అంచనా వేశారు. కార్యక్రమంలో ఐఈఆర్పీలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్



యర్రవరంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

ఏలేశ్వరం: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. మండలంలోని యర్రవరంలో జెడ్పీ నిధులు రూ.15 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు బుధవారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అలాగే గ్రామంలోని ఏలేరు నదిలోకి స్నానాల నిమిత్తం భక్తులు దిగేందుకు మెట్ల మార్గం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పెద్ద నాపల్లిలో డ్రైనేజీల్లో పూడిక తీత పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. గ్రామాల్లో రహదారులు, డ్రైన్ల నిర్మాణాన్ని వేగవంతం చేశామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు నీరుకొండ రామకుమారి, సర్పంచ్ బీశెట్టి అప్పలరాజు, నీరుకొండ సత్యనారాయణ, దాసరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రత్తిపాడు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు పని చేయాలని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అధికారులకు సూచించారు. మండలంలోని ధర్మవరంలో వివిధ శాఖల అధికారులతో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలన్నారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఉద్యోగులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం



జగ్గంపేటలో మహిళలకు సున్నావడ్డీ నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గండేపల్లి: మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. జగ్గంపేట ఎంఎస్ భవనంలో బుధవారం నియోజకవర్గంలోని మహిళలకు ఎమ్మెల్యే సున్నావడ్డీ పథకం నమూనా చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మహిళలకు సున్నా వడ్డీతో పాటు వైఎస్సార్ ఆసరా, చేయూత, కాపు నేస్తం, తదితర పథకాలు అందిస్తున్నట్టు తెలిపారు. అనంతరం నియోజకవర్గంలో గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి, గోకవరం మండలాలకు చెందిన 7282 మంది మహిళలకు రూ.9.72 కోట్ల విలువైన సున్నావడ్డీ నమూనా చెక్కును అందజేశారు. తొలుత ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం, ఏఎంసీ చైర్మన్ జనపరెడ్డి బాబు, జగ్గంపేట జేసీఎస్ మండల కన్వీనర్, ఉప సర్పంచ్ బండారు రాజా, గండేపల్లి ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వ్యవసాయ సలహామండలి సభ్యుడు ఒబిణ్ణి వీరబాబు, పార్టీ జగ్గంపేట మండలాధ్యక్షుడు ఒంటిపల్లి రామన్నదొర, ఎంపీడీఓ కె. వసంత్ కుమార్ పాల్గొన్నారు.

జయహో భారత్

- చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం
- పల్లెల్లో అంబరాన్నంటిన సంబరాలు



తునిలో వేంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న నాయకులు



ఏలేశ్వరంలో జయహో ఇస్రో ఆకారంలో విద్యార్థినులు



ప్రత్తిపాడులో ఇస్రో ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

ఏలేశ్వరం: చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావడంతో బుధవారం ఏలేశ్వరం పట్టణంలో ప్రజలు సంబరాలు జరిపారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు జయహో ఇస్రో ఆకారంలో కూర్చుని ప్రదర్శన చేశారు. వైఎస్సార్ సీపీ నేతలు సామంతుల సూర్యకుమార్, పైల విజయ్‌కుమార్, కోరాడ ప్రసాద్ ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో ఊరేగింపు నిర్వహించి స్వీట్లు పంపిణీ చేశారు.

తుని: చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావాలని కోరుతూ బుధవారం వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. స్థానిక పాత బజారు వీధిలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో దైవజ్ఞ నెల్లిపూడి రాజాబాబు సిద్ధాంతి ఆధ్వర్యంలో విష్ణుపారాయణ, గోవింద నామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు నార్ల రత్నాజీ, బీసీ ఐక్య వేదిక నాయకులు కుందెం సత్యనారాయణ, ఎల్.వీరన్న, కందుల వినోద్, ఆంజనేయ ప్రసాద్, కె.నానాజీ, సత్తిబాబు, పక్కుర్తి గోవిందరావు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. స్థానిక మినర్వా విద్యాసంస్థల ఆవరణలో విద్యార్థులు ఇస్రో, రాకెట్ ఆకారంలో కూర్చుని 'బోలో భారత్ మాతాకీ జై, జయహో చంద్రయాన్' అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మినర్వా చైర్మన్ మురళీకృష్ణ, డైరెక్టర్ ఆర్‌బీ చౌదరి, హెచ్‌ఎం మల్లికార్జున, ఇన్‌చార్జి లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నవరంలో ర్యాలీ

అన్నవరం: చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావడంతో రోటరీ క్లబ్ ఆధ్వర్యాన బుధవారం అన్నవరంలో ర్యాలీ నిర్వహించారు. దేవస్థానం హైస్కూల్ నుంచి సత్యదేవుని తొలిపాంచా వరకూ విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, కార్యదర్శి కొండా వేణుగోపాల్, కోశాధికారి అరిగల తాతయ్యదొర పాల్గొన్నారు.

గోకవరం: చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావడంతో గోకవరంలోని రాజా పబ్లిక్ స్కూల్ విద్యార్థులు బుధవారం రాత్రి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కరస్పాండెంట్ పట్నాల సూర్యప్రకాష్‌రావు, ప్రిన్సిపల్ రమానాగలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా జాతీయ జెండాను పట్టుకుని జయహో భారత్ అంటూ నినాదాలు చేశారు.

మెకానిక్‌కు ఆర్థిక సహాయం

తుని: ఇటీవల అనారోగ్యానికి గురైన మెకానిక్‌కు కనకదుర్గ మోటార్స్ మెకానిక్ యూనియన్ తరఫున ఆర్థిక సహాయం అందజేశారు. యూనియన్ మాజీ అధ్యక్షుడు ఎం.వేంకటేశ్వరరావు పక్షవాతానికి గురయ్యారు. దీంతో తుని, పాయకరావుపేటకు చెందిన కనకదుర్గ మోటార్స్ మెకానిక్ యూనియన్ తరఫున రూ.35 వేలు, ఆటోమొబైల్స్ నుంచి రూ.20 వేలు, బాలాజీ కన్సల్‌టెన్సీ ద్వారా రూ.5 వేలు వెరసి రూ.60 వేలు బుధవారం బాధితుడికి అందజేశారు. కష్టకాలంలో అండగా నిలిచిన యూనియన్ సభ్యులకు వేంకటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

గుండెపోటుతో ఎంపీటీసీ భర్త మృతి

కిర్లంపూడి: మండలంలోని సోమవరం ఎంపీటీసీ సభ్యురాలు అడబాల వెంకటలక్ష్మి భర్త, వైఎస్సార్ సీపీ నాయకుడు అడబాల శ్రీను బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు శ్రీను పార్థీవదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అతని కుటుంబానికి సంతాపం తెలిపారు.

పారదర్శకంగా ఓటరు సర్వే

ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో సుబ్బలక్ష్మి

ప్రత్తిపాడు: నియోజకవర్గంలో ఇంటింటా ఓటరు సర్వే పారదర్శకంగా జరుగుతోందని ప్రత్తిపాడు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి తెలిపారు. ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఓటరు జాబితా సవరణ, ఓటరు సర్వేపై ఎన్నికల సూపర్‌వైజర్లు, రాజకీయ పార్టీల నేతలతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న 92,236 గృహాలను బూత్ లెవెల్ అధికారులు (బీఎల్‌ఓలు) సందర్శించారన్నారు. ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన 397 మంది ఓటర్లను, మృతి చెందిన 2,020 మందిని, శాశ్వతంగా వలస వెళ్లిన 181 మందిని ఓటరు జాబితా నుంచి తొలగిస్తునట్టు చెప్పారు. చిరునామా సరిగా లేకపోవడం, జంక్ నంబర్లు, ఇంటి నంబర్లు లేని 3,000 మంది ఓటర్ల వివరాలను సరి చేశారని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఇంకా ఓటరుగా నమోదు కాకపోతే, వారిని ఓటర్లు జాబితాలో చేర్చేందుకు సహకరించాలని రాజకీయ పార్టీల నాయకులను కోరారు. సమావేశంలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి తహసీల్దార్లు పీవీవీ గోపాలకృష్ణ, జి.చిన్నారావు, కె.సుబ్రహ్మణ్యం, జి. భీమారావు, వైఎస్సార్ సీపీ నాయకులు రామిశెట్టి చినబాబు, దోశే నాని, ఏఎంసీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, లంపకలోవ సొసైటీ అధ్యక్షుడు గొంతిన సురేష్, పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను, బీజేపీ నాయకులు శింగిలిదేవి సత్తిరాజు, దాకే కృష్ణారావు, టీడీపీ నాయకుడు కొండపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సమావేశం



వైద్య శాఖ పనితీరును వివరిస్తున్న ములగపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి సౌజన్య

రౌతులపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మండల సర్వ సభ్య సమావేశం తూతూమంత్రంగా జరిగింది. మండల వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వరరావు ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులకు ఆర్‌బీకేల ద్వారా అందించిన విత్తనాలు, ఎరువులు, వివిధ రాయితీల గురించి వివరించారు. ఇంటింటా ఫీవర్ సర్వే చేసి జ్వర పీడితులను గుర్తించడంతో పాటు ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగిస్తున్నట్టు ములగపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సౌజన్య తెలిపారు. ములగపూడి పీహెచ్‌సీలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, చిన్నారులకు నేర్పిస్తున్న విద్యాబుద్ధులు గురించి ఐసీడీఎస్ మండల విస్తరణాధికారి జానకీలక్ష్మి వివరించారు. ఉద్యానవన, పశుసంవర్థక, వైఎస్సార్ క్రాంతి పథం, పంచాయతీ రాజ్ తదితర పలుశాఖల అధికారులు తమ శాఖల పనితీరును వివరించి మమ అనిపించారు. తొలుత టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక



ప్రత్తిపాడులో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్న డ్వామా పీడీ వెంకటలక్ష్మి

ప్రత్తిపాడు: మండలంలోని గ్రామాల్లో 2022–23 ఆర్థిక సంవత్సరానికి చేపట్టిన సామాజిక తనిఖీ పారదర్శకంగా జరిగిందని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి తెలిపారు. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అధ్యక్షతన జరిగింది. మండలంలో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు ఉపాధి హామీ పథకంలో చేసిన పనులపై గ్రామాల వారీగా డీఆర్పీలు తాము చేపట్టిన సామాజిక తనిఖీలను వివరించారు. ధర్మవరం, బవురువాక, ఉత్తరకంచి, ఒమ్మంగి తదితర గ్రామాల్లో వేతనదారుల మస్టర్లలో దిద్దుబాట్లు ఉన్నాయి. వెంకటనగరంలో రికార్డుల తనిఖీ జరగలేదు. పాండవులపాలెం, బవురువాక, చింతలూరు తదితర గ్రామాల్లో చేసిన పనిని తెలిపే బోర్డులు లేవు. గజ్జనపూడి, పెద్దిపాలెం, ఉత్తరకంచి గ్రామాల్లో జాబ్‌కార్డులు అప్‌డేట్ చేయలేదు. జాబ్‌కార్డులను తక్షణం అప్‌డేట్ చేయడమే కాకుండా, కార్డులు లేనివారందరికీ జాబ్‌కార్డులు అందజేయాలని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి అదేశించారు. జిల్లా అంబుడ్స్‌మెన్ ఎం.జ్యోతి, ఏపీడీ భానుప్రకాష్, ఎస్ఆర్పీ చిరంజీవి అప్పారావు, సోషల్ ఆడిట్ హెచ్ఆర్ రాజేష్, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు, పీఆర్ జేఈ ఎస్ నాగేశ్వరరావు, ఏపీఓ ఏబీవీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

తుని: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న వేడుకల (శత జయంతి వేడుకలు) పోస్టర్‌ను కుమ్మరిలోవ తపోవనం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ స్వామీజీ ఆవిష్కరించారు. ఆర్ఎస్ఎస్ ప్రముఖ్‌లు బుధవారం కుమ్మరిలోవ తపోవనానికి వెళ్లి స్వామీజీ ఆశీస్సులు పొందారు. జనజాగరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ కరపత్రాలు, రక్షాబంధన్‌కు రాఖీలను అందజేస్తామని గ్రామీణ వికాస ప్రముఖ్ చదరం నర్సింగరావు తెలిపారు. ప్రసాద్, ఎం.కుమార్, కుందెం సత్యనారాయణ, గేలం శ్రీను, శాస్త్రి, పర్వత బాబూరావు, ఆనంద్ పాల్గొన్నారు.

పలు సేవా కార్యక్రమాలు

ఏలేశ్వరం: టీడీపీ నేత పైల సుభాష్‌చంద్రబోస్ జన్మదినాన్ని పురస్కరించుకుని పట్టణంలో బుధవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ నగర్‌లో ఇటీవల అగ్ని ప్రమాదానికి గురైన బాధితులకు బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేశారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సతివాడ రాజేశ్వరరావు, పైల అయ్యప్ప, సుంకర పాండవులు, ముచ్చు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పరదేశమ్మతల్లి జాతర



వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న పరదేశమ్మ మాలధారణ భక్తులు

తునిరూరల్: ఎస్.అన్నవరం శివారు కొత్త సూరవరంలో కొలువైన పరదేశమ్మ అమ్మవారి జాతర మహోత్సవం బుధవారం రాత్రి వైభవంగా జరిగింది. బాలభక్త వినాయక సంఘం ఆధ్వర్యంలో జాతర నిర్వహించారు. ఆలయం నుంచి గ్రామ ముఖద్వారం వరకు విద్యుత్ దీపాలతో విశేషంగా అలంకరించారు. జాతరోత్సవాలను పురస్కరించుకని విశాఖపట్నం వారితో డీజే డ్యాన్స్ బేబీ డ్యాన్స్, విజయవాడ వారితో మ్యూజికల్ నైట్, డ్యాన్స్ హంగామా, వెంకటరమణమూర్తి పాట, గరగల నృత్యం తదితర ప్రదర్శనలు నిర్వహించారు. అమ్మవారి మాలధారణ చేసిన భక్తులు ఎస్.అన్నవరంలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మాల విరమణ చేశారు.

చెరువులో వ్యర్థాలు వేయవద్దంటూ ఆందోళన

గండేపల్లి: సాగునీటి చెరువులో చేపల వ్యాపారులు ఎరువులతో పాటు కోడి వ్యర్థాలను వేస్తున్నారని రైతులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. చేపల ఆహారంగా కోడి వ్యర్థాలను ఉపయోగించడంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని మల్లేపల్లి నరసరాజు చెరువు (మంచినీటి చెరువు)లో చేపలు పెంపకానికి సంబంధించి ప్రభుత్వానికి కొందరు సొమ్ములు చెల్లిస్తున్నారు. చెరువులో చేపలకు ఆహారంగా బుధవారం యూరియా ఎరువును చల్లుతుండటంతో స్థానికులు అడ్డుకున్నారు. అయినప్పటికీ సంబంధిత వ్యక్తులు పడవ ఆధారంగా ఎరువును చెరువు మధ్యలోకి తీసుకువెళ్లి యథావిధిగా చల్లారని గ్రామస్తులు చెబుతున్నారు. చెరువులో కోడి వ్యర్థాలు వేయడంతో ప్రజలు అనారోగ్యం పాలవుతారని, ఈ నీటిని తాగిన పశువులు సైతం రోగాల బారిన పడుతున్నాయని పాడి రైతులు ఆరోపించారు. దీనిపై ఇరిగేషన్ అధికారి లస్కర్ శేఖర్‌ను వివరణ కోరగా ఆయకట్టు చెరువుల్లో చేపలు ప్రకృతి పరంగా పెరగాలని, చెరువులో చేపలకు ఆహారంగా ఎరువులు, వ్యర్థాలు వేయకూడదని తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

మాజీ మంత్రి తోట నరసింహం



రామకృష్ణపురం ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న మాజీ ఎంపీ తోట నరసింహం

కిర్లంపూడి : రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడం సీఎం జగన్‌తోనే సాధ్యమని మాజీ మంత్రి తోట నరసింహం అన్నారు. రామకృష్ణాపురంలో చిట్రా నాగేశ్వరరావు, చిలకమర్తి బాబీ, బిల్లా రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తోట నరసింహం మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. రాబోయే ఎన్నికల్లో అఖండ మెజార్టీతో వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తోట రాంజీ, తోట బాబ్జీ, అత్తులూరి సాయిబాబు, బిల్ల పండు, చిలకమర్తి గోవిందరావు, గొడుగు ప్రసాద్, ఏడుకొండలు, కపూర్, తోట అయ్యన్న, ఓలేటి రాజు తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత 'టంగుటూరి'



శంఖవరంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

శంఖవరం: స్ఫూర్తి ప్రదాత ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. శంఖవరంలో బుధవారం ప్రకాశం పంతులు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రకాశంపంతులు చిత్ర పటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనిడాయారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఎస్.రమణ, గోవింద్ పాల్గొన్నారు.

ఏలేశ్వరం: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు పట్టణంలో బుధవారం ఘనంగా జరిగాయి. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ కొండలరావు ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ అలమండ సత్యవతి టంగుటూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నేతలు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, దోశే కిషోర్, సుంకర రాంబాబు, దిలబర్ హుస్సేన్ పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ ఆంధ్రకేసరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, అంబుడ్స్‌మెన్ ఎం.జ్యోతి, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు పాల్గొన్నారు.

కిర్లంపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తోట రవి ప్రకాశం పంతులు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, పెంటకోట నాగబాబు, సంఘన వెంకటేశ్వరావు, లంక మూర్తి, విశ్వనాథం(కాపు), పీలా సుబ్రహ్మణ్యం, యల్లపు నానాజీ పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: ఒమ్మంగి సచివాలయంలో టంగుటూరి చిత్ర పటానికి వైఎస్సార్ సీపీ జేసీఎస్ రామిశెట్టి చిన్నబాబు, రామిశెట్టి బుల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు.

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, ఎంఈఓ మామిడి శేఖర్, ఏఓ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు.